చైతన్య బస్తీలో ఆగిన వాటర్ పైప్‌లైన్ పనులు



వేయడానికి సిద్ధంగా ఉన్న వాటర్ పైపులు

- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయం..
- జలమండలి అధికారులపై జీహెచ్ఎంసీ అధికారుల ఫిర్యాదు



మూసాపేట చైతన్యబస్తీలో వాటర్ పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డు

కూకట్‌పల్లి/మూసాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుగా అధికారుల సమన్వయ లోపంతో జలమండలి అధికారులపై జీహెచ్ఎంసీ అధికారులు ఫిర్యాదు చేసిన సంఘటన కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలో జరిగింది. మూసాపేట డివిజన్ పరిధిలోని చైతన్యబస్తీలో మంచి నీటి పైప్‌లైన్ పాడవడంతో కలుషిత నీరు సరఫరా అవుతుంది. కాలనీవాసులు సమస్యను మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ దృష్టికి తీసుకుపోయారు. బీఆర్ఎస్ హయంలోనే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో సమస్యను వివరించడంతో చైతన్యబస్తీలో పైప్ లైన్ పూర్తిగా మార్చడానికి సుమారు రూ.34 లక్షలు మంజూరు చేసినట్లు స్థానికులు తెలిపారు.

గతంలో మంత్రిగా పనిచేసిన విజయరామారావు హయంలో చైతన్యబస్తీలో పైప్‌లైన్‌లు వేశారు. 24 ఏళ్లుగా పైప్‌లైన్‌లు మార్చకపోవడంతో పైప్‌లైన్లు పగిలి బస్తీలో కలుషితనీరు సరఫరా కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు రోజుల క్రితమే జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం నుంచి చైతన్యబస్తీకి వాటర్‌లైన్ పనులు ప్రారంభించారు. ప్రధానరోడ్డులో 8 ఇంచులు కాలనీలో 6, 4 ఇంచుల పైప్‌లైన్లు వేయడానికి సిద్ధంగా ఉంచారు.

ఆగిన పనులు

చైతన్యబస్తీలో వాటర్ పైపులైన్ పనులకోసం కాలనీలో ఉన్న ప్రధాన రోడ్డుతో పాటు గల్లీలో కూడా రోడ్డు తవ్వకాలు ప్రారంభించారు. మరికొన్నిచోట్ల పైప్‌లైన్ పనులు కూడా ప్రారంభించారు. కాని జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇవ్వకుండా పైప్ లైన్ పనులకోసం జలమండలి అధికారులు రోడ్డు తవ్వకాలు జరపడంతో జీహెచ్ఎంసీ అధికారులు జలమండలి అధికారులపై ఫిర్యాదు చేశారు. దాంతో పనులు కాస్తా మధ్యలోనే ఆగిపోయాయి. దాంతో చైతన్యబస్తీ వాసులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు వెంటనే ప్రారంభించాలి



చైతన్యబస్తీలో కలుషిత నీటి సమస్య ఎన్నో ఏళ్లుగా ఉంది. నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి అధికారుల సమన్వయ లోపంతో పనులు ఆగిపోయినాయి. ఇప్పటికైన జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు ఆగిపోయిన వాటర్ పైప్‌లైన్ పనులు వెంటనే ప్రారంభించాలి. పనుల్లో ఏమాత్రం జాప్యం జరిగిన బస్తీవాసులతో కలిసి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తాం

- గరిగె తుకారం, చైతన్యబస్తీకాలనీ

రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం..

జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందడంలో కాస్త ఆలస్యం జరగడంతో కొంత ఇబ్బంది కలిగింది. ఇప్పుడు అంతా సర్దుకుంది. మరో రెండు రోజుల్లో చైతన్యబస్తీలో వాటర్‌లైన్ పనులు ప్రారంభిస్తాం. వీలైనంత త్వరగా పైప్‌లైన్ పనులు పూర్తిచేస్తాం.

- విలియమ్స్ ప్రకాశ్, జలమండలి మేనేజర్, మూసాపేట

పాలేరు కాలేజీ నిర్మాణానికి టెండర్లు పిలవండి

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు రెవెన్యూ మంత్రి ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలేరు జేఎన్‌టీయూ కళాశాలకు సొంత భవనాల నిర్మాణానికై వెంటనే టెండర్లు పిలవాలని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న కాలేజీ భవనాల కోసం రూ.108.60 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 8న ఉత్తర్వులు జారీచేసింది. నిధులు మంజూరై 20రోజులైనా నిర్మాణ పనులు ప్రారంభించక పోవడంపై మంగళవారం జేఎన్‌టీయూ ఉన్నతాధికారులను తనవద్దకు పిలిపించుకొని వారిపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలకు అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అకడమిక్ బ్లాక్‌ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరిలోగా టెండర్లు పూర్తిచేసి, మార్చి రెండోవారం నుంచి పనులు ప్రారంభించాలన్నారు. వేసవికాలంలోగా పనులు పూర్తిచేయని పక్షంలో వర్షాకాలం పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ మంత్రిని కలిసిన వారిలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, పలువురు ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.



జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా పుష్పగుచ్ఛం అందుకుంటున్న అనురాధ

రచయిత్రి యలమర్తి అనురాధకు సన్మానం

అల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాంపల్లిలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అల్లాపూర్ స్థానిక రచయిత్రి, కవయిత్రి అయిన యలమర్తి అనురాధకు సన్మానం జరిగింది. గద్వాల సంస్థాన ఆస్థాన కవి 'కవిసింహ' కాశీ పత్యపథానుల 133వ జయంతి ఉత్సవ కమిటీ నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొన్న యలమర్తి అనురాధ తన కవిత 'తెలుగు భాష'ను చదివి వినిపించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా.జస్టిస్ చంద్రయ్య చేతులమీదుగా శాలువ, పూల బొకేతో సన్మానించారు. కార్యక్రమంలో వేముల గౌరీశంకర్, డా.రాధశ్రీ, వీర్రాజు, శ్యాంసుందర్, సుందర్రావు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి డయార్‌గూడ శ్మశానవాటిలో మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

శ్మశానవాటికలో మెరుగైన వసతులు కల్పించాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికల్లో మెరుగైన వసతులు ఏర్పాటుచేసి వాటిని మోడల్ శ్మశానవాటికలుగా తీర్చిదిద్దాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు, మున్సిపల్ అధికారులతో కలిసి 121 డివిజన్ పరిధిలోని డయార్‌గూడా, ప్రకాశ్‌నగర్ శ్మశానవాటికలను వెంటనే ఆధునీకరించాలనీ మున్సిపల్ అధికారులకు సూచించారు. డయర్‌గూడా శ్మశానవాటికలో బెంచీలు, స్నానాల గదులు, ప్రహరీ వెంటనే నిర్మించాలన్నారు. ఆగిపోయిన పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించి అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. పారిశుధ్య సమస్యపై అలసత్వం వహించరాదన్నారు. దోమలతో ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచోట్ల ఫాగింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు సీహెచ్ ప్రభాకర్, బొట్టు విష్ణు, శ్రీదర్‌రెడ్డి, సీహెచ్‌బాబు, మేకల నర్సింగ్ మున్సిపల్ అధికారులు ఈఈ గోవర్దన్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ సునీల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ బాలాజీనగర్ సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కోసం బుధవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ భీమాలింగప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆకార్ హాస్పిటల్, రాందేవ్‌రావు హాస్పిటల్, శివానంద రిహాబిలిటేషన్ సెంటర్, అలాగే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కైత్లాపూర్, జెవెన్‌హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో బుధవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్లు బండి గంగాధర్, భారతి వంశీకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం కొత్తగా దరఖాస్తుల్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ల వారీగా ఆయా వార్డు కార్యాలయాల్లోని సేవా కేంద్రాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉంటారన్నారు

కూకట్‌పల్లి సర్కిల్: ఓల్డ్‌బోయిన్‌పల్లి-విశాల్, బాలానగర్- రవి, కూకట్‌పల్లి- అలేఖ్య, వివేకానందనగర్-వేణు, హైదర్‌నగర్- నీలిమ, ఆల్విన్‌కాలనీ- ప్రభావతి.

మూసాపేట్ సర్కిల్: కేపీహెచ్‌బీ- కె.శైలజా, బాలాజీనగర్- కె.నాగరాజు, అల్లాపూర్- గిరిధర్, మూసాపేట్- భిక్షపతి, ఫతేగనర్- రియాజుద్దీన్.

ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆపద మిత్ర శిక్షణ కోసం జిల్లాలోని అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సూచనల మేరకు ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, తుపాన్లు వరదలు సంభవించినప్పుడు స్వచ్ఛందంగా సేవచేసే వారిని సన్నద్ధులను చేసేందుకు మూడు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణలో ఉచితంగా భోజనం, వసతి కల్పించి సర్టిఫికెట్ ఇస్తారన్నారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు కనీసం 7వ తరగతికి పైగా చదువుకొని సేవాభావం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడా సర్వీసుల కార్యాలయంలో దరఖాస్తు పారం పొంది ఫిబ్రవరి 2లోపు అందజేయాలని తెలిపారు.

జర్నలిస్టుల పేరుతో నేతల వసూళ్లు

- కట్టడి చేయాలంటూ ప్రజాప్రతినిధులకు కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ వినతి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు

హైదర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్న పార్టీ నాయకులను కట్టడి చేయాలని ఎమ్మెల్యేలకు, రాజకీయ పార్టీల నేతలకు కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు మాధవరం కాంతారావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్‌లకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ జర్నలిస్టులకు డబ్బులు ఇవ్వాలని భవన నిర్మాణ దారులను బెదిరిస్తూ కొందరు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాళ్ల వల్ల సమాజంలో జర్నలిస్టులపై చులకన భావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు తొట్ల పరమేష్, దయాసాగర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కరీం, కార్యదర్శి రంజిత్‌కుమార్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాణిక్యరెడ్డి, గంగరాజు, నవీన్‌రెడ్డి, లక్ష్మణ్, సదా మహేష్, హరిబాబు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్‌కు వినతి

బాలానగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణ దారుల వద్ద అక్రమంగా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి జర్నలిస్టులు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు బాలానగర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొంత మంది జర్నలిస్టులను అడ్డం పెట్టుకొని, వారి పేరు మీద భవన నిర్మాణ దారులను భయభ్రాంతులకు గురిచేస్తూ, పెద్దమొత్తంలో డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి, జర్నలిస్టులకు చెడ్డ పేరు వస్తుందని, వీటిని నియంత్రించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



కూకట్‌పల్లి వడ్డెపల్లి ఎన్‌క్లేవ్ ఎదురుగా రోడ్డుపై చెత్తను మేస్తున్న ఆవులు

చెత్తను తీయరూ..?

కూకట్‌పల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్తవేయరాదు అని మున్సిపల్ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా కొందరికి మాత్రం అవి వినిపించడం లేదు. ప్రధానరోడ్లపైనే ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దాంతో మూగజీవులు వేసిన చెత్తను తింటున్నాయి. దాంతో రోడ్లపైన చాలా చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. కూకట్‌పల్లి జగద్గిరిగుట్ట వెళ్లేదారిలో వడ్డెపల్లి ఎన్‌క్లేవ్ ఎదురుగా ఉన్న నాలా వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని జీహెచ్ఎంసీ శానిటేషన్ డీఈ శ్రీనివాస్‌రావును కోరడంతో వారు వెంటనే స్పందించారు. వీలైనంత త్వరగా ప్రధానరోడ్డులో ఉన్న చెత్తను తొలగిస్తామని తెలిపారు.



డైరెక్టర్లను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

పదవులు ప్రజాసేవకే వినియోగించాలి

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పదవులు ప్రజాసేవకే వినియోగించాలి, స్వప్రయోజనాలకు కాదని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. నూతనంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన అస్లామ్, రాజేందర్‌లను బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, మార్కెట్‌లోని సమస్యలను గుర్తించి, పరిష్కరించే దిశగా రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, పుష్పారెడ్డి, లక్ష్మయ్య, సంజీవ, మోన్‌రెడ్డి, రమేష్, రాజు పటేల్, అరుణ్, నవాబ్, రమాదేవి, రేణుక పాల్గొన్నారు.

నిధుల కొరతతో నత్తనడకన త్రికూటాలయం పనులు



జనప్రియనగర్‌లోని శివరామాంజనేయ త్రికూటాలయం పనులను పర్యవేక్షిస్తున్న కమిటీ సభ్యులు

అల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ జనప్రియనగర్‌లోని దశాబ్దాల గుడి పునర్నిర్మాణానికి నిధుల కొరత వేధిస్తోందని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొండం ఆదిరెడ్డి, జనప్రియ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 2022లో ప్రారంభించిన ఆలయ పునఃనిర్మాణ పనులు, దాతల విరాళాలతో మొదట వేగంగా నడిచాయి. శ్రీ శివరామాంజనేయ, త్రికూటాలయంగా ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయ ప్రాంగణానికి నేడు నిధుల కొరత కారణంగా నిర్మాణం పనులు నెమ్మదించాయి. ఇప్పటికే గణపతి ఆలయం, శివాలయం, రామాలయం, ఆంజనేయుడి గుడి గోపురాలు, నవగ్రహాల మండపం అధిక శాతం పనులు పూర్తయినట్టు వారు పేర్కొన్నారు. అనుకున్న విధంగా ఆలయ నిర్మాణం పూర్తిచేసుకుని వచ్చే మార్చి నెలాఖరులో దేవతా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తున్నా నిధుల కొరత కారణంతో ఆయా గడువులోపల పనులు పూర్తవుతాయా అన్న సందేహం కలుగుతోందని నిర్మాణ కమిటీ వారు ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి, నిర్మాణ పనులకు విరాళాలు అందించి, ఆలయ నిర్మాణ బృహత్కార్యంలో భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

సైబరాబాద్‌లో సీజ్ చేసిన నార్కోటిక్ డ్రగ్స్ ధ్వంసం

- డ్రగ్స్ విలువ రూ.2.25 కోట్లు



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ బృందం

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో తెలంగాణ స్టేట్ యాంటి నార్కోటిక్ బ్యూరో (టీఎస్ న్యాబ్) సీజ్ చేసిన నార్కోటిక్ డ్రగ్‌ను సైబరాబాద్‌కు చెందిన డ్రగ్ డిస్పోజల్ కమిటీ మంగళవారం ధ్వంసం చేసింది. టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యవేక్షణలో సుమారు 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీ కేంద్రమైన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో ఉన్న జీజే మల్టీక్లేవ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ధ్వంసం చేశామని పోలీసులు తెలిపారు. ఇందులో 845.281 కేజీల గంజా, 3 గంజాయి చెట్లు, 26.819 కిలోల గంజాయి చాక్‌లెట్లు, 7.5 ఎం.ఎల్ హష్ ఆయిల్, 9.168 గ్రాముల ఎండీఎం డ్రగ్, 502 గ్రాముల అల్‌ప్రాజోలంలు ఉన్నాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 5 జోన్‌లైన మాదాపూర్, బాలానగర్, మేడ్చల్, రాజేంద్రనగర్, శంషాబాద్‌లలో 12 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మొత్తం 37 కేసుల్లో వీటిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. డ్రగ్‌ను ధ్వంసం చేసే కమిటీ చైర్మన్‌గా డీసీపీ క్రైమ్స్ కె.నరసింహ, ఏసీపీ సైబర్ క్రైం రవీందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌ల బృందం పర్యవేక్షణలో మండుతున్న బాయిలర్‌లో వేసి ధ్వంసం చేశారని తెలిపారు.



స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో జెడ్ఈవో దొడ్డ శిరీష, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు

'భాష్యం'లో ఇంట్రా స్పోర్ట్స్ మీట్

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం కలిగి ఉండాలని భాష్యం స్కూల్స్ జోన్-1 జెడ్ఈవో దొడ్డ శిరీష అన్నారు. ప్రగతినగర్, వివేకానందనగర్, కేపీహెచ్‌బీ, నిజాంపేట్, జీడిమెట్ల, ఎస్ఆర్‌నగర్ బ్రాంచీలకు సంబంధించి జోనల్ ఇంట్రా స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్‌లో ఆమె ప్రారంభించారు. విద్యార్థినీ, విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపు ఓటములు సహజమని, ఇష్టమైన క్రీడను ఆడాలని సూచించారు. కార్యక్రమంలో భాష్యం స్కూల్స్ సీఈవో జొన్నల చైతన్య, కేపీహెచ్‌బీ భాష్యం స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బెజవాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ఆల్విన్ కాలనీ యువకుడు



స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డితో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్, ప్రవీణ్

హైదర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గణేష్‌నగర్‌లో నివాసం ఉండే చింత ప్రవీణ్ ఫిబ్రవరి 1వ తేదీన ఢిల్లీలో జరగబోయే అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ 57 కిలోల విభాగంలో ఎంపికైన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ప్రవీణ్‌తో కలిసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె.శివసేనరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను శివసేనారెడ్డి అభినందించారు.ఈ టోర్నమెంట్‌కు ప్రవీణ్‌కు ప్రభుత్వం ద్వారా కావాల్సిన నిధులు, సహాయం అందేలా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పట్టారి శశిధర్, నాగేశ్వర్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన వారితో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

క్రీడల్లో యువతను ప్రోత్సహించాలి

బాలానగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ రాజీవ్‌గాంధీ వెల్ఫేర్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-7లో విజేతలుగా నిలిచిన టీమ్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని యువత క్రీడల్లో దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం అన్నారు.



వరదనీటి కాల్వ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

వరదనీటి కాల్వ పనులు పూర్తి చేయాలి

హైదర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ నిజాంపేట్‌రోడ్డు హోలిస్టిక్ ఆస్పత్రి వద్ద జరుగుతున్న వరదనీటి కాల్వ పనులను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద కాలువ పనుల్లో డ్రైనేజీ నీరు లీకేజీ జరుగుతున్నదని తెలుసుకుని జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ అధికారులు సమన్వయంతో పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులుపూర్తిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ బగ్గీని ప్రారంభిస్తున్న ఎంపీ రవిచంద్ర

నిమ్స్‌కు ఎలక్ట్రిక్ బగ్గీ అందజేసిన ఎంపీ రవిచంద్ర

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధులతో ఎలక్ట్రిక్ బగ్గీ అందజేశారు. దీనిని ఆస్పత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పచ్చజెండా ఊపి బగ్గీని నడిపారు. ఎంపీ వద్దిరాజు ఈ ఆస్పత్రికి గతంలోనూ రెండు బగ్గీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను డాక్టర్ లక్ష్మీభాస్కర్, పీఆర్వోలు సత్యాగౌడ్, వరలక్ష్మి, ఉష తదితరులు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూర్య విష్ణు, బండి సంజీవ్, యాదాక్రాంతి, బండారి అనిల్, వెంకట్ గౌడ్, పి.శ్రీరామ్, జి.అరుణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రామరాజు

తెలంగాణ తొలి దశ ఉద్యమకారులకు అన్యాయం

- 4 వేల మంది బతికే ఉన్నారు
- ప్రత్యేక కమిటీ ద్వారా గుర్తించి కార్డులు జారీచేయాలి

మన్సూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 1969 నాటి ఉద్యమ స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమం కొనసాగిందని, ఉద్యమ స్ఫూర్తితో వచ్చిన తెలంగాణలో ఉద్యమకారులకే తీవ్ర అన్యాయం జరగడం బాధాకరమని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన మలిదశ ఉద్యమకారులతో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో మంగళవారం సంఘం రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసి 1969 నాటి ఉద్యమకారుల సమస్యలను పలు రకాలుగా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నామని, కానీ ఏ ఒక్క ప్రభుత్వం మేనిఫెస్టోలో తప్ప తమ గోడును పట్టించుకోవడం లేదన్నారు. 1969 నాటి ఎంతో మంది ఉద్యమకారుల్లో ప్రస్తుతం సుమారు 4వేల మంది మాత్రమే సజీవంగా ఉన్నారన్నారు. ప్రత్యేక కమిటీ ద్వారా వారికి గుర్తింపు కార్డులు జారీచేయాలని కోరారు. అదేవిధంగా గౌరవప్రదమైన రూ.10 వేల నుంచి రూ.15వేల పెన్షన్, 250 చదరపు గజాల ఇంటి స్థలం, ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న తమకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, ఉచిత రవాణా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల మలిదశ ఉద్యమకారులు వనం చంద్రమౌళి, యేళ్ల చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డి.సుదర్శన్ రావు, కె.సీతారాంరెడ్డి, కె.విశ్వేశ్వర్‌రావు, బొమ్మిడి లక్ష్మీనారాయణ, ఎస్.భాస్కర్‌శర్మ, కూతురు కృష్ణమూర్తి, ముత్తినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

- రూ.26.25 లక్షలు కొల్లగొట్టిన ముఠా
- నలుగురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసి రూ.26.25 లక్షలు కొల్లగొట్టిన ముఠా ఆట కట్టించారు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేటకు చెందిన గడ్డపల్ల పవన్‌కుమార్, కింద్రాబాద్‌కు చెందిన బోగా రేవంత్, అంబర్‌పేటకు చెందిన సకినాల సుధీర్, ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన రాజీవ్‌రెడ్డి ఒకరి ద్వారా మరొకరికి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సులభంగా డబ్బు సంపాదించాలని రేవంత్ పథకం వేశాడు. ఆ విషయాన్ని పవన్‌కు చెప్పాడు. సుధీర్‌కు గతంలో కన్సల్టెన్సీలో పనిచేసిన అనుభవం ఉండటంతో నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో బురిడీ కొట్టించి డబ్బు సంపాదించాలని నిర్ణయించారు. ఇలా సుధీర్ నిరుద్యోగుల డేటాను సేకరించి పవన్‌కు ఇచ్చేవాడు. పవన్ హెచ్‌ఆర్ మేనేజర్‌లా మాట్లాడుతూ ఐటీ కంపెనీల్లో బ్యాక్‌డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించేవాడు. ఆ తర్వాత వారికి ఫేక్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగానికి ఎంపికైనట్లు నమ్మించేవాడు. అలా ఒక్కో ఉద్యోగానికి రూ.2 లక్షల చొప్పున 13 మంది నుంచి రూ.26.25 లక్షలు వసూలు చేశారు. తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితులు పోలీసులను సంప్రదించడంతో నార్త్‌జోన్ పోలీసులు రంగంలోకి దిగారు. మారేడుపల్లి పోలీసులతో కలిసి నిందితులను పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.67 లక్షల నగదు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మారేడుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆపద మిత్ర శిక్షణ కోసం జిల్లాలోని అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అదనపు కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సూచనల మేరకు ప్రకృతి వైపరీత్యాలైన లాండ్ స్లైడ్స్, భూకంపాలు, తుఫాన్లు వరదలు సంభవించినప్పుడు స్వచ్ఛందంగా సేవ చేసే (ఆపద మిత్రుడు) వారిని సన్నద్ధులను చేసేందుకు మూడు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచితంగా భోజనం, వసతి కల్పించి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన 18 సంవత్సరాలు పైబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు కనీసం 7వ తరగతికి పైగా చదువుకొని సేవాభావం కలిగి ఉండాలన్నారు.

అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడా సర్వీసుల కార్యాలయం దరఖాస్తు ఫారం పొంది ఫిబ్రవరి 2వ తేదీలోపు అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

అపరిశుభ్రతకు నిలయంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి



కొండాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీ
- మరుగు దొడ్లకు నీటి వసతి కరువు
- దోమలతో ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది





అపరిశుభ్రంగా జిల్లా ఆస్పత్రి పరిసరాలు

గచ్చిబౌలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ జిల్లా ఆస్పత్రి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఆస్పత్రి ముందుభాగం బాగున్నా వెనుక ఇరువైపులా చెత్తాచెదారం, డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. పారిశుధ్య కార్మికులు ఇటు వైపు వచ్చి శుభ్రం చేసిన దాఖలాలు లేవు. దీంతో ఆస్పత్రి ఆవరణ దుర్గంధభరితంగా మారి రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

కొండాపూర్ ఏరియా ఆస్పత్రి జిల్లా ఆస్పత్రిగా మారిన తర్వాత ప్రతి రోజు 500 నుంచి 700 మంది ఓపీలో వైద్య సేవలు పొందుతున్నారు. నిత్యం రద్దీగా ఆస్పత్రి ఉంటుంది. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు, ప్రసూతి కోసం వచ్చే మహిళలు, డెలివరీ అనంతరం ఉండేవారు సమారు 100 మంది వరకు ఉంటున్నారని వైద్యులు తెలిపారు. ఇన్‌పేషెంట్లకు తోడుగా ఉండే వారు కూడా ఇక్కడ ఉంటారు. ఆస్పత్రి వెనుక డ్రైనేజీ పొంగడం, చెత్తాచెదారంతో దుర్వాసన, దోమల బెడదతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

నీటి సరఫరా లేక ఇబ్బందులు

రోగులు, వారి సహాయకులు మరుగుదొడ్లు వాడాల్సి వస్తే బయట నుంచి నీరు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నిత్యం వందలాది మంది వస్తున్న జిల్లా ఆస్పత్రికి నీటి సరఫరా లేకపోవడం విడ్డూరమని రోగులు వాపోతున్నారు. కనీసం మూత్ర విసర్జన కూడా చేయలేని పరిస్థితి ఉందంటే మరుగుదొడ్ల పరిస్థితి ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూసిన పాపనపోలేదు. ఆస్పత్రి ముందుమాత్రం శుభ్రంగా ఉంచుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

డ్రైనేజీ సమస్య చాలా రోజులుగా ఉంది. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టిలో కూడా ఉంది. పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పారిశుధ్య సమస్య, నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

-ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ

నల్లగండ్లలోని పార్కు స్థలం కబ్జా



నల్లగండ్లలోని పార్కు స్థలం కబ్జా చేసేందుకు మట్టివేసి చదును చేసిన దృశ్యం

గచ్చిబౌలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేకంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా హైడ్రా అనే సంస్థను తీసుకువచ్చింది. నిత్యం ఈ సంస్థ జంటనగరాలు, పరిసర ప్రాంతాల్లో ఎక్కడో అక్కడ నిత్యం కూల్చివేతలు చేస్తునే ఉంది. అవసరమయితే కబ్జాదారులపై కేసులు కూడా నమోదు చేస్తుంది. ఇంత జరుగుతున్నా కబ్జా దారులు భయపడకుండా కబ్జాకు పాల్పడుతున్నారు. ఈ వ్యవహారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి పక్కనే జరిగింది. అప్పట్లో హుడా సంస్థ శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల గ్రామశివారుల్లో లేఔట్ చేసి విక్రయించింది. కొంత పబ్లిక్ అవసరాల నిమిత్తం రెండు పబ్లిక్ పార్కులు, ఖాళీ స్థలాలు వదిలేశారు. వీటిని కబ్జాదారులు సుమారు 1200 గజాల స్థలాన్ని రాత్రి కిరాత్రే చదును చేసి పాత బిల్డింగ్ మెటిరియల్ వేస్తున్నారు. స్థానికులు ఈ విషయం ఎవరో కబ్జా చేస్తున్నారని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ స్థలంలో ఓ నిరుపేద గుడిసె వేసుకుని నివాసం ఉంటున్నాడు. ఈ స్థలం మాది మీరు ఖాళీ చేయాలని అతడిని బెదిరిస్తున్నారు. ఏదిఏమైన విలువైన హెచ్ఎండీఏ స్థలం సుమారు రూ.12 కోట్లు ఉంటుంది. అధికార, అనాధికార వ్యక్తులే ఈ కబ్జాకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. అధికారులకు స్థానికులు ఇప్పటికే ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని తెలిసింది. అధికారులు స్పందించకపోవడంతో వారి అండతోనే కబ్జాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు పత్రాల అందజేత

హైదర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి బిల్లుల పరిహారార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన మంజూరు పత్రాలను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కి చెందిన పగడాల షామిలినికి రూ.2.20 లక్షలు, హైదర్‌నగర్ ఆదిత్యనగర్‌కు చెందిన వెంకట్‌కు రూ.1.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు గొప్పవరమన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

సైబరాబాద్‌లో సీజ్ చేసిన నార్కోటిక్ డ్రగ్స్ ధ్వంసం

- డ్రగ్స్ విలువ రూ.2.25 కోట్లు



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ బృందం

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో తెలంగాణ స్టేట్ యాంటి నార్కోటిక్ బ్యూరో (టీఎస్ న్యాబ్) సీజ్ చేసిన నార్కోటిక్ డ్రగ్స్‌ను సైబరాబాద్‌కు చెందిన డ్రగ్ డిస్పోజల్ కమిటీ మంగళవారం ధ్వంసం చేసింది. టీఎస్ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యవేక్షణలో సుమారు 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీ కేంద్రమైన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో ఉన్న జీజే మల్టీక్లేవ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ధ్వంసం చేశామని పోలీసులు తెలిపారు. ఇందులో 845.281 కేజీల గంజా, 3 గంజాయి చెట్లు, 26.819 కిలోల గంజాయి చాక్‌లెట్లు, 7.5 ఎం.ఎల్ హాష్ ఆయిల్, 9.168 గ్రాముల ఎండీఎం డ్రగ్, 502 గ్రాముల అల్‌ప్రాజోలంలు ఉన్నాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 5 జోన్‌లైన మాదాపూర్, బాలానగర్, మేడ్చల్, రాజేంద్రనగర్, శంషాబాద్‌లలో 12 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మొత్తం 37 కేసుల్లో వీటిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. డ్రగ్‌ను ధ్వంసం చేసే కమిటీ చైర్మన్‌గా డీసీపీ క్రైమ్స్ కె.నరసింహా, ఏసీపీ సైబర్ క్రైం రవీందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌ల బృందం పర్యవేక్షణలో మండుతున్న బాయిలర్‌లో వేసి ధ్వంసం చేశారని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హైదర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎంటీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జన్మభూమికాలనీ, శివమ్మకాలనీ, మహవీర్ నగర్, పీజేఆర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినాయక, సమతానగర్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వెస్టన్‌హిల్స్, అడ్డగుట్ట రోడ్డునెంబర్ 1నుంచి 7వరకు, వాటర్ ట్యాంక్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు అయ్యప్పస్వామికి ఘనంగా పూజలు

చందానగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పీజేఆర్‌లోని జగత్‌రక్షక శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు తీర్థప్రసాదాలు, సాయంత్రం స్వామివారికి పల్లకిసేవతో జరుగనుందని ప్రసాద్‌గురుస్వామి తెలిపారు.

తీరనున్న రైలు ప్రయాణికుల కష్టాలు



చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన లిఫ్టులు

చందానగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన లిఫ్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మూడు నెలల నుంచి రెండు ప్లాట్‌ఫాంలపై లిఫ్ట్ బిగించే నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ స్టేషన్‌లో రైలు దిగి పట్టాలు దాటుకుంటూ ప్రయాణికులు వెళ్లేవారు. ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ ఉన్నప్పటికి అది కొందరికి ఉపయోగకరంగా లేదు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌పైకి ఎక్కిదిగేందుకు చాల ఇబ్బందులు పడేవారు. ఎక్కలేని వారు రైలు పట్టాలు దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఈ పట్టాలు దాటే సమయంలో రైలు ప్రమాదాలు జరగడంతో చాలమంది ప్రాణాలు గాల్లో కలిశాయి. నష్టనివారణ కోసం చాలమంది రైల్వే అధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యటనకు వచ్చినప్పుడు విషయాన్ని వివరించి వినతిపత్రం అందజేశారు. గతేడాది చివర లిఫ్ట్ నిర్మాణ పనులు ప్రారంభమై ప్రస్తుతం పారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

అధిక లాభాల పేరుతో భారీ మోసం

వ్యాపారి నుంచి రూ.20 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్లో అధిక లాభాలంటూ బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్ నగరానికి చెందిన వ్యాపారి నుంచి రూ.20.28 లక్షలు కొల్లగొట్టారు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. రెండు వారాల క్రితం నగరానికి చెందిన వ్యాపారి ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన చూశాడు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు పొందవచ్చని ఉండటంతో అందులో ఉన్న వాట్సాప్ నంబర్‌కు కాల్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేసిన మహిళ స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వచ్చే విధానాల గురించి వివరించింది. ఆమె మాటలు నమ్మిన బాధితుడు ప్రారంభంలో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టి మంచి లాభాలు అందుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళ అతనికి ఓ వాట్సాప్ లింకును పంపింది (ఎన్.అనజోమర్.కామ్). ఇది అంతర్జాతీయ స్టాక్ అండ్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ అని, ఇందులో వివరాలు నమోదు చేసి పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. అందుకు అవసరమైన లాగిన్ ఖాతాను సృష్టించారు. ఇదంతా నిజమని నమ్మిన బాధితుడు విడతలవారీగా రూ.20.28 లక్షల పెట్టుబడులు పెట్టాడు. అందుకు లాభాలతో కలిపి 77,275 యూఎస్ డాలర్స్ వచ్చినట్లు వర్చువల్‌గా చూపించారు. అయితే వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు వారు అంగీకరించలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని డిమాండ్ చేయడం, విత్‌డ్రాకు అనుమతి ఇవ్వకపోవడంతో వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ ధార కవిత తెలిపారు.

IN THE COURT OF THE XIV ADDITIONAL CHIEF JUDGE ; CITY CIVIL COURT HYDERABAD
O.S.No.175 OF 2024

Between :
Sri A.M. Kannan ...Plaintiff
AND
M/s. Gowthami Projects Limited and others ...Defendants

To
1. M/s. Gowthami Projects Limited (formerly M/s. Growmagnet India Limited) represented by its director Sri Leelakrishna Tummala, office at Flat No.307, Usha Mahalakshmi Apartments Road No.2, Jubilee Gardens, Kothaguda, Hyderabad -500 084.
2. Sri Leelakrishna Tummala, Director, M/s.Gowthami Projects Limited, office at Flat No.307, Usha Maha lakshmi Apartments, Road No.2, Jubilee Gardens, Kothaguda, Hyderabad - 500 084.
3. Sri Shiva Prasad Tummala Director, M/s. Gowthami Projects Limited R/o. Flat No.402, Shree Hanuman Indraprasthanam, Mythrinagar, Vignanpuri Colony, Kukatpally, Hyderabad.
4. Sri Venkateswara Rao Tummala Director, M/s. Gowthami Projects Limited, office at Level-7, Maximus Towers, Building 2A Mind Space Complex, Hi-Tech City, Hyderabad - 500 081 ...Defendants No.1 to 4

Whereas the plaintiff has instituted above suit against you for recovery of an amount of Rs.64,96,282/-. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to suit or who shall be accompanied by some person able to answer all such questions on the **25th day of February, 2025** at 10.30 a.m. in the forenoon and further you are hereby directed to file on that day written statement of your defence and to produce all documents in your possession or power upon which you base your defence.

Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence as exparte.

(BY ORDER OF THE COURT)

M/s. SHYAM S.AGRAWAL
L.Praveen Kumar, L. Pradhan Kumar
K. Shashirekha and Naresh Singh,
Advocates
101, R.K.Residency, 3-6-237/1, Street No.15, Himayatnagar, Hyderabad-29,
Hyderabad. phone: 23222700
Date : 29-01-2025 **Mobile : 986 567 3168.**

జర్నలిస్టుల పేరుతో నేతల వసూళ్లు

- కట్టడి చేయాలంటూ ప్రజాప్రతినిధులకు కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ వినతి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు

హైదర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్న పార్టీ నాయకులను కట్టడి చేయాలని ఎమ్మెల్యేలకు, రాజకీయ పార్టీల నేతలకు కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు మాధవరం కాంతారావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్‌లకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ జర్నలిస్టులకు డబ్బులు ఇవ్వాలని భవన నిర్మాణ దారులను బెదిరిస్తూ కొందరు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాళ్ల వల్ల సమాజంలో జర్నలిస్టులపై చులకన భావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు తొట్ల పరమేష్, దయాసాగర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కరీం, కార్యదర్శి రంజిత్‌కుమార్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాణిక్యరెడ్డి, గంగరాజు, నవీన్‌రెడ్డి, లక్ష్మణ్, సదా మహేష్, హరిబాబు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్‌కు వినతి

బాలానగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల పేరుతో భవన నిర్మాణ దారుల వద్ద అక్రమంగా డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న పార్టీ కార్యకర్తలు, నాయకులపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి జర్నలిస్టులు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు బాలానగర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొంత మంది జర్నలిస్టులను అడ్డం పెట్టుకొని, వారి పేరు మీద భవన నిర్మాణ దారులను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి, జర్నలిస్టులకు చెడ్డ పేరు వస్తుందని, ఇలాంటి వాటిని నియంత్రించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అడుగేయలేం..!

- ఎక్కడ గుంతలున్నాయో తెలియక తికమక పడుతున్న వాహనదారులు
- కుంగిపోయిన మ్యాన్‌హోళ్లతో ప్రమాదాలు
- గాజులరామారం పరిధిలో శిథిలమైన అంతర్గత రహదారులు



చంద్రానగర్‌లో ప్యాచ్‌లు చేయని రోడ్డు



శివనగర్ కమాన్ వద్ద శిథిలమైన రోడ్డు



భగత్‌సింగ్‌నగర్‌లో మురికి కుంటగా రోడ్డు

కుత్బుల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ పరిధిలోని అంతర్గత రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధ్వానమైన రోడ్లలో అడుగుతీసి అడుగు వేయాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రాత్రి సమయంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుందని, వాహనదారులైతే అదుపుతప్పి కిందపడిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని చంద్రానగర్ రోడ్ నెంబర్ 9లో ఏడాది క్రితం ఉన్న రోడ్డును తవ్వించి భూగర్భ డ్రైనేజీ లైన్ వేయించిన అధికారులు ప్యాచ్‌వర్క్‌లు చేయడం మరిచిపోయారు. అదేవిధంగా శివానగర్ ముఖద్వారం వద్ద రోడ్డు కొట్టుకుపోయి గుంతలుగా మారిపోయింది. భగత్‌సింగ్‌నగర్ నుంచి విజయనగర్ కాలనీకి వెళ్లే రోడ్డులో మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. దానిపై నుంచి వాహనాలు వెళ్లి కూలిపోయే అవకాశముందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. భగత్‌సింగ్‌నగర్ రోడ్ నెంబర్ 53లో సీసీ రోడ్డు సగమే వేసి వదలివేయడంతో కిందికి దిగేందుకు వాహనదారులు జంకుతున్నారు. రోడ్ నెంబర్ 58 సమీపంలో గుంతల్లో మురుగు నిలిచి దోమలకు నిలయంగా మారింది. రోడ్ నెంబర్ 55లో దశాబ్దం క్రితం వేసిన రోడ్డు పాడవడంతో మట్టిరోడ్డే దిక్కయిందని, కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. విజయనగర్, మారుతీనగర్ సరిహద్దులో ఏర్పడిన గుంతలతో మురుగు నిలవడంతో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి వీధిలో ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నా.. అధికారులు, పాలకులు తమ సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆయా కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

సమస్యలున్న కాలనీలలో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటిస్తాం. అత్యవసరమైన ప్రాంతంలో తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. మిగతా వాటికి ప్రతిపాదనలు రూపొందించి పరిష్కరించేందుకు కృషిచేస్తాం.

- మల్లారెడ్డి, గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్

ఐటీ మంత్రిని కలిసిన ఎన్‌ఎస్‌యూఐ నాయకులు



శ్రీధర్‌బాబుకు పూలమొక్కను అందజేస్తున్న సాయికుమార్

జీడిమెట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : దావోస్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు చేరుకున్న ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్ పంతులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై పెట్టుబడుల సాధనలో ప్రత్యేక ఆకర్షణగా సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నిలిచారని అన్నారు. దీంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయన్నారు.



అయోధ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తా

పేట్‌బషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని అయోధ్యనగర్‌లో ఆమె స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. జలమండలి అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తానని కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, జానకి, అంజయ్య, వీరేశం, సింహాద్రి, పాపయ్య, వనజ పాల్గొన్నారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న కొలన్ హన్మంత్ రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాల అందజేత

దుండిగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు జరుగుతోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60వేలు, రూ.46 వేలు, రంగారెడ్డినగర్, ఇందిరాగాంధీనగర్‌కు చెందిన శిరోమణికి రూ.60వేలు, ఉమా రూ.47,500 పత్రాలను ఆయన అందజేశారు. గాంధీనగర్‌కు చెందిన మమతకు రూ.లక్షా116 కల్యాణ లక్ష్మి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివ, శ్రీనివాస్, నిజాంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు కె. రాజశేఖర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రకాశరావు, ప్రశాంత్‌రెడ్డి, బి. నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆర్యవైశ్య సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి

షాపూర్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, షాపూర్‌నగర్ సంఘం సభ్యులు మంగళవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆ సంఘం సభ్యులు షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌ని కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. గాజులరామారం, షాపూర్‌నగర్‌లలోని అమ్మవారి ఆలయాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో గాజులరామారం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ పవన్ కుమార్‌గుప్త, షాపూర్‌నగర్ ప్రెసిడెంట్ వాస శ్రీనివాస్‌గుప్త, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌గుప్త, శంకర్‌గుప్త, ఉప్పలయ్య, హర్ష, ప్రియాంక, కవిత, గీత, మమత పాల్గొన్నారు.

యూజీసీ మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలి

షాపూర్‌నగర్, జనవరి28(ఆంధ్రజ్యోతి): యూజీసీ మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూజీసీ గైడ్‌లైన్స్‌పై కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ముసాయిదా బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాలని కోరారు. యూజీసీ ముసాయిదా అమల్లోకి వస్తే వర్సిటీలు విధ్వంసం అవుతాయన్నారు. దీంతో వీసీల నియామకాల్లో రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదని తెలిపారు. దీంతో వీసీ పోస్టులకు అర్హత సాధించాలంటే 15 ఏళ్ల ప్రొఫెసర్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ దీన్ని యూజీసీ ముసాయిదాలో తొలగించారన్నారు. యూనివర్సిటీలను తమ ఆధీనంలోకి తీసుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తక్షణమే ఈ గైడ్‌లైన్స్‌ను వెనక్కి తీసుకునే వరకు యూఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు.

తాగునీరు రోడ్డు పాలు!



పద్మానగర్‌లో రోడ్డుపై పారుతున్న తాగునీరు

కుత్బుల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పద్మానగర్ ఫేజ్-2 శ్మశానవాటిక సమీపంలో ఉన్న తాగునీటి పైప్‌లైన్ లీకేజీలకు గురవుతూ రోడ్డుపైనే పారుతుంది.. మురుగునీరంతా పైప్‌లైన్‌లో కలిసే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. వాహనదారులు, పాదచారులు అటుగా వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



బొల్లారం తిరుమల గిరిలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ సెక్రటరీ ప్రభుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేకు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి భవన నిర్మాణాన్ని వివరించారు.

- దుండిగల్ (ఆంధ్రజ్యోతి)

ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఆందోళన



వినతి పత్రాలతో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

దుండిగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను కాపాడాలంటూ బాచుపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రాలను అందించినా పట్టించుకోవడం లేదని, కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున కాంగ్రెస్, బీజేపీ నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆగం పాండు, ఆకుల సతీష్ మాట్లాడుతూ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆకృతి కన్‌స్ట్రక్షన్ అప్రోచ్ రోడ్డు లేకున్నా, సర్వేనెంబరు 454లో పెద్ద చెరువు తూము నాలాస్థలంలో రోడ్డు వేశారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆకృతి కన్‌స్ట్రక్షన్ యజమాని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కావడమే కాకుండా, ఎమ్మెల్యే అనుచరుడు కావడంతోనే అనుమతులు వచ్చాయన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోకుండా ఎమ్మెల్యే అడ్డుపడుతున్నాడని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. కలెక్టర్ బాచుపల్లి తహసీల్దార్‌కు 64 గజాల అప్రోచ్ రోడ్డు మార్కెట్ రేటు ప్రకారం ఇవ్వడానికి అనుకూలంగా ఆర్డీఓకు రాశారని ఆరోపించారు. దీంతో వివిధ పార్టీల నాయకులతో కలిసి ధర్నాకు దిగుతున్నామన్నారు. ప్రస్తుత తహసీల్దార్ వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అప్రోచ్ రోడ్డు స్థలాన్ని కాపాడాలని, ఆకృతి కన్‌స్ట్రక్షన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఆ మల్లేశ్వరి, అరుణ్‌రావు, ముఖేష్, సుధాకర్‌రెడ్డి, కవితారెడ్డి, పాండు, ఎల్లాస్వామి, శ్యామ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఆపద మిత్ర శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆపద మిత్ర శిక్షణ కోసం జిల్లాలోని అర్హులైన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అదనపు కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి ముకుందరెడ్డి తెలిపారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సూచనల మేరకు ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, తుఫాన్లు వరదలు సంభవించినప్పుడు స్వచ్ఛందంగా సేవచేసే వారిని సన్నద్ధులను చేసేందుకు మూడు విడతలుగా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణలో ఉచితంగా భోజనం, వసతి కల్పించి సర్టిఫికెట్ ఇస్తారన్నారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు కనీసం 7వ తరగతికి పైగా చదువుకొని సేవాభావం కలిగి ఉండాలన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడా సర్వీసుల కార్యాలయంలో దరఖాస్తు ఫారం పొంది ఫిబ్రవరి 2లోపు అందజేయాలని తెలిపారు.

పాలేరు కాలేజీ నిర్మాణానికి టెండర్లు పిలవండి

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు రెవెన్యూ మంత్రి ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలేరు జేఎన్‌టీయూ కళాశాలకు సొంత భవనాల నిర్మాణానికై వెంటనే టెండర్లు పిలవాలని రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న కాలేజీ భవనాల కోసం రూ.108.60 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 8న ఉత్తర్వులు జారీచేసింది. నిధులు మంజూరై 20రోజులైనా నిర్మాణ పనులు ప్రారంభించక పోవడంపై మంగళవారం జేఎన్‌టీయూ ఉన్నతాధికారులను తనవద్దకు పిలిపించుకొని వారిపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలకు అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, అకడమిక్ బ్లాక్‌ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరిలోగా టెండర్లు పూర్తిచేసి, మార్చి రెండోవారంనుంచి పనులు ప్రారంభించాలన్నారు. వేసవిలోగా పనులు పూర్తిచేయని పక్షంలో వర్షాకాలం పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ మంత్రిని కలిసిన వారిలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.



విజయ్‌వర్ధన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గాయత్రీ నగర్ కాలనీ వాసులు

కాలనీల్లో గస్తీని పెంచండి

పేట్‌బషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో గస్తీని పెంచాలని పేట్‌బషీరాబాద్ సీఐ విజయ్‌వర్ధన్‌కు గాయత్రీనగర్ కాలనీవాసులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో రహదారులపైనే సిగరెట్లు, కార్లలో కూర్చొని మందు తాగడంతో వచ్చీ పోయే మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలోని పార్కుల్లో చిన్నారులతో వాకింగ్‌కు వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రతీ రోజు సాయంత్రం పెట్రోలింగ్ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో అత్యుత్‌వర్ధన్, విజయ్‌భాస్కర్, రామరాజు, శ్రీరాములు, ప్రవీణ్, సత్తిరెడ్డి, సంతోష్‌రెడ్డి ఉన్నారు.

అల్లా చెరువును ఆగం చేయొద్దు : ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదాన్ని పంచుతున్న అల్లా చెరువును ఆగం చేయొద్దని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్‌లోని అల్లా చెరువులో అంగడిపేట, శివాలయం సమీపంలోని షాపింగ్‌మాల్స్‌కు సంబంధించిన మురుగు అంతా చెరువులో కలుస్తుందని, స్థానిక యువకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మంగళవారం అధికారులతో కలిసి అల్లా చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మురుగు నీటిని చెరువులోకి వదులుతున్న మాల్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా సుమారు రూ. 40 లక్షలతో ఈ చెరువును సుందరీకరణ చేపట్టామన్నారు. ఈ చుట్టు పక్కల పెరుగుతున్న బహుళ అంతస్థుల నిర్మాణాల్లో ఉన్న ప్రజలకు ఈ పార్కు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుందని, మురుగు నీటిని చెరువులో కలిపితే ఎంతటి వారినైనా వదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఈఈ లక్ష్మీగణేష్, డీఈ పాపమ్మ, ఏఈ అనురాఘ్, డీజీఎం రాజేష్, మేనేజర్ అనూష, బీఆర్ఎస్ నాయకులు బి. సోమేష్ యాదవ్, పుప్పాల భాస్కర్, రుద్ర అశోక్, తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

చిన్నపాటి మెలకువలు పాటిస్తే ప్రమాదాలు దూరం

పేట్‌బషీరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి మెలకువలు పాటిస్తే ప్రమాదాలు దరిచేరవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సాదుల శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల, పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని 108 అంబులెన్స్ వాహనాల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై కళాకారులు పాటలుపాడి, డ్రైవర్లకు వినిపించారు. కార్యక్రమంలో రవాణశాఖ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో సీజ్ చేసిన నార్కోటిక్ డ్రగ్స్ ధ్వంసం

డ్రగ్స్ విలువ రూ.2.25 కోట్లు



సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ బృందం

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో తెలంగాణ స్టేట్ యాంటి నార్కోటిక్ బ్యూరో (టీఎస్‌న్యాబ్) సీజ్ చేసిన నార్కోటిక్ డ్రగ్‌ను సైబరాబాద్‌కు చెందిన డ్రగ్ డిస్పోజల్ కమిటీ మంగళవారం ధ్వంసం చేసింది.

టీఎస్‌న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పర్యవేక్షణలో సుమారు 872 కిలోల నార్కోటిక్ డ్రగ్స్‌ను కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ అండ్ డిస్పోజల్ ఫెసిలిటీ కేంద్రమైన రంగారెడ్డి జిల్లా నందిగామ మండ ల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో ఉన్న జీజే మల్టీక్లేవ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ధ్వంసం చేశామని పోలీసులు తెలిపారు. ఇందులో 845.281 కేజీల గంజా, 3 గంజాయి చెట్లు, 26.819 కిలోల గంజాయి చాక్‌లెట్లు, 7.5 ఎం.ఎల్ హాష్ అయిల్, 9.168 గ్రాముల ఎండీఎం డ్రగ్, 502 గ్రాముల అల్ప్రాజోలంలు ఉన్నాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 5 జోన్‌లైన మాదాపూర్, బాలానగర్, మేడ్చల్, రాజేంద్రనగర్, శంషాబాద్‌లలో 12 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మొత్తం 37 కేసుల్లో వీటిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. డ్రగ్‌ను ధ్వంసం చేసే కమిటీ చైర్మన్‌గా డీసీపీ క్రైమ్స్ కె.నరసింహా, ఏసీపీ సైబర్ క్రైం రవీందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ కళింగరావు, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌ల బృందం పర్యవేక్షణలో మండుతున్న బాయిలర్‌లో వేసి ధ్వంసం చేశారని తెలిపారు.



చింతల నాగరాజును సన్మానిస్తున్న కార్మికులు

కార్మికుల సంక్షేమమే ధ్యేయం : చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సంక్షేమమే తన ధ్యేయమని కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ధర్మకేబుల్ కంపెనీలో నూతన ఒప్పందం కోసం ఆయన కృషి చేసినందుకు మంగళవారం చింతల్‌లోని తన నివాసానికి చేరుకుని సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, మూడు సంవత్సరాలకు ఒక్కో కార్మికుడికి రూ.10 వేలు ఇచ్చేందుకు, ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులకు రెగ్యులరైజ్ చేసేందుకు ఒప్పందం కుదిర్చామన్నారు. అదే విధంగా కార్మికుల కుటుంబానికి ఏడాదికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్, దసరా పండుగకు నెల జీతం బోనస్, ఏడాదికి రెండు జతల బూట్లు, దుస్తులు ఇప్పించేందుకు అగ్రిమెంట్ చేయించామని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం సహకరించిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ, ఫిలిప్స్, వెంకట్‌రెడ్డి, భజన్‌ఖాన్, భాస్కర్‌రెడ్డి, సురేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధిక లాభాల పేరుతో భారీ మోసం

వ్యాపారి నుంచి రూ.20 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్లో అధిక లాభాలంటూ బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్ నగరానికి చెందిన వ్యాపారి నుంచి రూ.20.28 లక్షలు కొల్లగొట్టారు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. రెండు వారాల క్రితం నగరానికి చెందిన వ్యాపారి ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన చూశాడు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు పొందవచ్చని ఉండటంతో అందులో ఉన్న వాట్సాప్ నంబర్‌కు కాల్ చేశాడు. ఫోన్ లిఫ్టు చేసిన మహిళ స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వచ్చే విధానాల గురించి వివరించింది. ఆమె మాటలు నమ్మిన బాధితుడు ప్రారంభంలో చిన్న మొత్తంలో పెట్టుబడులు పెట్టి మంచి లాభాలు అందుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళ అతనికి ఓ వాట్సాప్ లింకును పంపింది (ఎన్.అనజోమర్.కామ్). ఇది అంతర్జాతీయ స్టాక్ అండ్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ అని, ఇందులో వివరాలు నమోదు చేసి పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. అందుకు అవసరమైన లాగిన్ ఖాతాను సృష్టించారు. ఇదంతా నిజమని నమ్మిన బాధితుడు విడతలవారీగా రూ.20.28 లక్షల పెట్టుబడులు పెట్టాడు. అందుకు లాభాలతో కలిపి 77,275 యూఎస్ డాలర్స్ వచ్చినట్లు వర్చువల్‌గా చూపించారు. అయితే వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు వారు అంగీకరించలేదు. ఇంకా ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టాలని డిమాండ్ చేయడం, విత్‌డ్రాకు అనుమతి ఇవ్వకపోవడంతో వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ ధార కవిత తెలిపారు.